క్లుప్తంగా

జిల్లాకు చేరిన అంబులెన్స్‌లు



జనగామ: ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన మూడు 108 అంబులెన్స్‌లు మంగళవారం కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. త్వరలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో ఉన్న 102 పాత వాహనాల స్థానంలో వీటిని ఇచ్చారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- జెడ్పీ సీఈఓ మాధురి కిరణ్ చంద్రషా



తరిగొప్పుల: విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని జెడ్పీసీఈఓ మాధురి కిరణ్ చంద్రషా సూచించారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళశారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, స్టోర్ రూంను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం నుంచి అబ్దుల్‌నాగారం రోడ్డులో జెడ్పీ నిధులతో నిర్మించిన డ్రెయినేజీని పరిశీలించారు. తహసీల్దార్ నాగేశ్వరచారి, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఆర్‌ఐ రవీందర్ పాల్గొన్నారు.

రేపు అబాకస్ శిక్షణ శిబిరం

జనగామ: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు, ఉపాధ్యాయులకు ఈ నెల 5(గురువారం)వ తేదీన అబాకస్‌పై శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు అడ్లగట్ల గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ అబాకస్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవడంతో పాటు అభ్యసన సామర్థ్యాలు పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్‌లో 5వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ ద్వారా విద్యార్థులు క్యాలిక్యులేటర్ కంటే వేగంగా లెక్కలు చేయవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం వాట్సాప్-9440444956 నంబర్‌ను సంప్రదించాలన్నారు. దీనిని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

జనగామ రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి మర్చిపోయిందని విమర్శించారు. అప్పులు చేసి నిర్వాహకులు వంట చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఖలీదా బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రంగమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమ్మడి రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

సొసైటీ భూములను ఆక్రమిస్తే చర్యలు

- పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు

చిల్పూరు: సొసైటీ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని చిల్పూరు-స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు హెచ్చరించారు. మంగళవారం డైరెక్టర్లతో కలిసి చిల్పూరు, కొండాపూర్ గ్రామాల్లోని సొసైటీ భవనాలు, స్థలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఈఓ ముగ్దుం, డైరెక్టర్లు మారేపల్లి కిషన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, ఊమ్లా నాయక్, వక్కల రాజు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

- యువకుడి మృతి



ప్రశాంత్ (ఫైల్)

కొడకండ్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రామవరం గ్రామానికి చెందిన మచ్చ శశి, లెజండ్‌లు మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాల అయిపోగానే అదే గ్రామానికి చెందిన మందుల ప్రశాంత్ (22) కనిపించడంతో ద్విచక్ర వాహనం ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మోడల్‌స్కూల్ ఎదురుగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రశాంత్, శశిలకు తీవ్ర గాయాలు కాగా లెజండ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతి చెందాడు.

ఆర్‌యూబీ నిర్మాణానికి అడ్డంకులు

- తన భూమిలో పనులు చేయొద్దని రైతు అభ్యంతరం
- ఆ స్థలం రైల్వేదే అంటున్న అధికారులు
- అయినా ససేమిరా అంటోన్న వైనం
- కలెక్టర్‌ను కలిసి వివరించే యోచనలో అధికారులు



ఆర్‌యూబీ నిర్మాణంలో నిడిగొండ వైపు నిలిచిన అండర్ గ్రౌండ్ రోడ్డు పనులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ రైల్వే ట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం పనులపై సందిగ్ధత నెలకొంది. ట్రాక్‌కు ఓ వైపు నిర్మాణ పనులపై స్థానిక రైతు ఒకరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తన భూమిలో ఆర్‌యూబీ నిర్మించేందుకు అంగికరించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో నిడిగొండ వైపు పనులు తాత్కాలికంగా నిలిపి వేశారు. దీనిపై రైల్వే అధికారులు ఇప్పటికే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం కలెక్టర్‌ను కలవాలని యోచిస్తున్నారు. ట్రాక్ వద్ద గేటుతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అత్యవసర సమయాల్లో సకాలంలో గేటు తెరవక కొందరు ప్రాణాలు కొల్పోయారు. ఈ నేపథ్యంలో రూ.5 కోట్లతో ఆర్‌యూబీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ నెల 1 నుంచి 4 వరకు గేట్ బంద్‌చేసి ఆర్‌యూబీ నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టారు. ఫతేషాపూర్ వైపు అండర్ గ్రౌండ్ రోడ్డుకు 30 ఫీట్లు ఉండగా, నిడిగొండ వైపు 30 ఫీట్లు ఉండదని ఓ రైతు నిర్మాణ పనులు చేయొద్దని కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. అంతే కాకుండా పనులు నిలిపి వేశారు. ఇరువైపులా ఉన్న భూమి రైల్వే శాఖకు చెందినది ఉంటుందని, అందులోనే పనులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. దీనిని రైతు అంగీకరించడం లేదు. ఇది తన పట్టా భూమి అని.. పనులు చేయొద్దని ఖరాకండిగా చెబుతున్నాడు. దీంతో కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. భూమి రైల్వే శాఖదా ..? రైతుదా ..? అన్నది రెవిన్యూ శాఖ తేల్చుతుందా ..?లేక కలెక్టర్ రైతుతో మాట్లాడి ఒప్పిస్తారా అన్నది తేలాల్సి ఉంది. భూమి రైతుదే అని నిర్ధారణ అయిన పక్షంలో అవసరమైన స్థలాన్ని చట్ట ప్రకారం సేకరించాలి. ఇందుకు నిర్ణీత మొత్తం పరిహారం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిగా కొనసాగుతున్న పనులు కొన్ని రోజులుగా వేగం పుంజుకున్నాయి. ఇంతలోనే భూ వివాదం నెలకొనడం గమనార్హం.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లూజ్ లైన్ల సమస్య, మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రాంబాబు, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ఆవిరినేని రణదీర్, రూరల్ ఏఈ బోయిని సత్తయ్య, ఇంజనీర్లు రాంబాబు, రాకేష్, మన్విత, ఏఓ గోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి, మల్లారెడ్డి పాల్గొన్నారు. అలాగే పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి



జనగామ: నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు



దేవరుప్పుల: శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

జనగామ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రం స్వర్ణకారుల మార్కెట్‌లో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి, ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లాకు శ్రీకాంతాచారి పేరు పెట్టడంతో పాటు ట్యాంకు బండ్‌పై విగ్రహం నెలకొలపాలన్నారు. పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు పాన్నోజు రతన్ కుమార్, మారోజు ఆనంద్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరుప్పుల: నాటి తెలంగాణ రైతాంగ సాయధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అమరత్వం స్ఫూర్తితో నేటి తెలంగాణ సాధన కోసం ఆత్మ బలిదానం చేసుకున్న మలివిడత అమరుడు కాసోజు శ్రీకాంతాచారి చిరస్మరణీయుడని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తీగల పరుశరాములు అన్నారు. మండలంలోని జనగామ-సూర్యాపేట రహదారి గొల్లపల్లి బస్‌స్టేజీ వద్ద కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి పురస్కరించుకుని ఆయన స్మారక విగ్రహానికి బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

పాలకుర్తి టౌన్: తెలంగా సాధన మలిదశ ఉద్యమ అమరులను గత ప్రభుత్వం పాటు నేటి ప్రభుత్వం విస్మరించిందని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు అబ్బోజు యాకస్వామి అన్నారు. శ్రీకాంత్‌చారి వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి అని విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ధీగోజు నరసింహ చారి అన్నారు. మంగళవారం పట్టణం నుంచి విశ్వకర్మలు కాసోజు శ్రీకాంతాచారి స్వగ్రామంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభకు జిల్లా నుంచి విశ్వకర్మలు తరలివెల్లారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

చిల్పూరు: అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని నిల్వ చేయకూడదన్నారు. తహసీల్దార్ సరస్వతి, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఆర్‌ఐ శ్రీనివాస్, కార్యదర్శి సుందరగిరి నవనీత, సీసీ రమాదేవి ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

- ఉద్యానవన అధికారి శంకర్

రఘునాథపల్లి: ఆయిల్ పామ్‌సాగుతో మంచి లాభాలు పొందవచ్చని,, రైతులు ఆ దిశగా దృష్టిసారించాలని ఉద్యానవన అధికారి శంకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేసుకునే రైతులు 30 ఏళ్ల వరకు దిగుబడి పొందవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు సౌజన్య, కళ్యాణి, వినోద్‌కుమార్, సుస్మిత, సుకన్య ఉన్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రజలను దగా చేసిన కాంగ్రెస్

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీఆర్



స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో ప్రజలను దగా చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిరంకుశ, అవినీతి పాలన సాగిస్తుందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ తయారు చేసిన ఛార్జిషీట్‌పత్రాలను విడుదల చేశారు. బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఐకమత్యంతో ముందుకుసాగాలి

- గోపా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



మాట్లాడుతున్న ఆంజనేయులు

రఘునాథపల్లి: గౌడ కులస్తులు పార్టీలకతీతంగా ఐకమత్యంతో ముందుకు సాగాలని గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా అధ్యక్షుడు మేకలపోతుల ఆంజనేయులుగౌడ్ పిలుపు నిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గోపా మండల అధ్యక్షుడు పుల్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో ఉత్తమ ఫలితాలు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యే విద్యార్థులకు గోపా అండగా ఉంటుందన్నారు. అనంతరం గోపా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన పుల్ల రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి గైని శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు గద్దమీది కిరణ్‌గౌడ్, శంకరి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్కాపురం శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శులు కుర్ర సురేందర్‌గౌడ్, మాచర్ల శ్రీనివాస్‌గౌడ్, పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బైరగోని శ్రీనివాస్‌గౌడ్, చిల్పూరు మండల అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



పాలకుర్తి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నర్సయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తున్న అతిథులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఛాగల్లు గ్రామంలో వాటర్‌ప్లాంట్ వద్ద ప్లాంట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకం రమేశ్ మాట్లాడారు. ఛాగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న వాటర్‌ప్లాంట్‌లో దివ్యాంగులకు ఉచితంగా మినరల్ వాటర్ అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

భవితకేంద్రంలో...

ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని భవితకేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఈఓ కొమురయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి బి.నర్సింహారావు మాట్లాడారు. అనంతరం స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజు భవిత కేంద్రం విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందించారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

పాలకుర్తి: దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల కేంద్రంలో విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ఆట, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

ఆత్మగౌరవం కలిగిఉండాలి

దేవరుప్పుల: దివ్యాంగులు ఆత్మగౌరవాన్ని కలిగి ఉండాలని ఎంసీఓ గుంటిపల్లి కళావతి సూచించారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని కేక్‌కట్ చేసి ప్రోత్సాహక బహుమతులు, స్వీట్లు అందించారు. దొపాటి మహేశ్, శంకర్, రమేష్, తల్లిదండ్రులు శారద, యేలేంద్ర పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అందించకపోవడం శోచనీయం

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు



తరిగొప్పుల: విద్యార్థులతో మాట్లాడుతున్న చందు

తరిగొప్పుల: విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడస్తున్న నేటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం శోచనీయమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గదరాజు చందు అన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దామెర ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గురుకుల బాటకు అనుమతి నిరాకరణ

జనగామ: బీఆర్‌ఎస్ గురుకుల బాటలో భాగంగా జిల్లా కేంద్రంలోని హనుమకొండ రోడ్డు సోషల్ వెల్ఫేర్ గురుకులంలోకి నాయకులు వెళ్లకుండా గేట్లకు తాళం వేశారు. నాయకులు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించే సమయంలో గురుకులంలోకి అనుమతించక పోవడంతో అక్కడే నిరసన తెలిపారు. టీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ మాట్లాడారు. గేటు వద్దకు విద్యార్థులను పిలిపించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ మైనార్టీ నాయకులు మహమ్మద్ యాకుబ్ పాషా, మండల మైనార్టీ అధ్యక్షుడు యాకూబ్, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యలకు నిలయంగా గురుకుల పాఠశాలలు

పాలకుర్తి టౌన్: ప్రభుత్వ గురుకుల పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. ప్రభుత్వ గురుకుల బాటలో భాగంగా మంళవారం మండలంలోని గూడూరు గిరిజన బాలికల గురుకుల పాఠశాల, పాలకుర్తి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఎల్లయ్య, వేణు, గణేష్, మాధవి, యాకయ్య పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: సీఎం కప్ 2024 టోర్నమెంట్‌లో భాగంగా జిల్లాలో గ్రామపంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనే వారు దరఖాస్తు చేసుకోవాలని క్రీడల యువజన శాఖ అధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో జరిగి క్రీడా పోటీలకు పంపించబడుతుందన్నారు. 7న గ్రామ పంచాయతీ, 8, 9 తేదీల్లో మున్సిపల్, మండల స్థాయిలో 10, 11, 12, జిల్లా స్థాయిలో 16వ తేదీ నుంచి 21 వరకు జరుగుతాయన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో లాంగ్ జంప్, పరుగు పందెం, డిస్కస్ త్రో, షాట్ పుట్, పుట్ బాల్, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు.

పోటీలు నిర్వహించాలి

పాలకుర్తి: సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించాలని డీఆర్‌డీఓ వసంత అన్నారు. మంగళవారం పాలకుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పీడీలు, జీపీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 7,8 తేదీల్లో గ్రామస్థాయి, 10.11,12 తేదీల్లో మండల పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయితి కార్యదర్శులు పాల్గొన్నారు.

7 నుంచి క్రీడాపోటీలు

తరిగొప్పుల: ఈనెల 7వ తేదీ నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి రాణాప్రతాప్ తెలిపారు. ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండల, గ్రామ స్థాయిలో నిర్వహించే సీఎం కప్ నిర్వహణపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. తాహసీల్దార్ నాగేశ్వరచారి, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఏఎస్సై కాసర్ల రాజయ్య, ఎంఈఓ నెల్లుట్ల జానకి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం..

జఫర్‌గఢ్: బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

డీఈఓను కలిసిన బీజేపీ నాయకులు

జనగామ రూరల్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ రమేశ్‌ను మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జైన వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు అనిల్, చంద్రయ్య, జగదీష్, కార్తిక్ పాల్గొన్నారు.

సిబ్బంది వివరాలు నమోదు చేయాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జీపీ ఉద్యోగుల సంఘం నాయకుడు కొమురెల్లి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జున్‌కు వినతి పత్రాన్ని అందించారు. ప్రభాకర్, నాగయ్య, బాబుగౌడ్, సురేష్, అశోక్, రాజు, లలిత, శ్యామల పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల/ కళాశాలలో హిందీ, ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్‌గా బోధించేందుకు గాను అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు హిందీ, ఫిజిక్స్ బోధించేందుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి



జనగామ రూరల్: జిల్లా గ్రామీణ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భూ కొనుగోలులో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి కొనుగోలులో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తాని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి, రాపర్తి సోమయ్య, రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగల ముఠాలో ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. మంగళవారం ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన మారుజోడు రాంబాబు గత నెల 18న రాత్రి 10 గంటల వరకు పార్టీ నాయకులతో ఇంట్లోనే గడిపి ఇంటికి తాళం వేసి హనుమకొండకు వెళ్లారు. మహబూబ్‌నగర్‌కు చెందిన విరగదిండ్ల పవన్‌కుమార్ ఓ కేసులో రెండేళ్ల క్రితం జైలు జీవితం గడుపుతుండగా అక్కడ పలు నేరాలతో జైలులో ఉన్న పలు జిల్లాలకు చెందిన షేక్ బాబావాలి, తయాబ్, పులి నరేష్, లింగస్వామిలతో స్నేహం పెంచుకున్నాడు. జైలు నుంచి బయటకు వచ్చాక సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. కొన్నాళ్ల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చి దొంగతనాలు చేస్తున్నారు. గత నెల 18న అర్ధరాత్రి వారు ఓ అద్దె కారు, ద్విచక్రవాహనంలో రఘునాథపల్లిలో సంచరిస్తుండగా రాంబాబు ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించారు. ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో దూరి రూ.40 వేల విలువైన సోని టీవీ, రిస్ట్ వాచ్ ఎత్తుకెళ్లారు. దొంగలించిన టీవీని హైదరాబాద్‌లో పవన్‌కుమార్ విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశామని, మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దేవరుప్పుల: తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఊర సృజన్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. కోల్కొండకు చెందిన భాషంపెల్లి రాములు కొడుకు సందీప్ 2020లో వివాహం జరుగగా బాబు పుట్టిన కొన్నాళ్లకే అనారోగ్యతో మృతి చెందగా మనస్థాపం చెంది అచేతన స్థితిలోకి వెళ్లాడు. దీంతో గత నెల 27న తల్లిదండ్రులు ఏదైనా పని చేయాలని మందలించగా మనస్థాపంతో క్షణికావేశంలో పురుగుల మందు సేవించాడు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కి తీసుకువెళ్లగా చికిత్స అందించిన డాక్టర్లు బతకడం కష్టమని ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. ఇంటికి తీసుకువచ్చే క్రమంలో ఏరియా ఆస్పత్రి జనగామకు తీసుకువెళ్లగా మృతి చెందాడు. మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్: వలస కార్మికులు వారి స్వగ్రామాలకు వెళ్లిపోవాలని మండలంలోని పాంనూరు కార్మికులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 60 మంది భవన నిర్మాణ రంగ కార్మికులం ఉన్నామని, ఇటీవల వలసకార్మికులతో పనులు లేకుండా పోయాయన్నారు. కావున వలసకార్మికులు వెళ్లేవరకు నిరసన కార్యక్రమాలు చేపడ్తామన్నారు. వెంకన్న, ఎల్లయ్య, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి

జఫర్‌గఢ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆటల పోటీలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ కోసం స్థల పరిశీలన

దేవరుప్పుల: గత ఏడాదిగా వివాదస్పదంగా మారిన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ స్థితిగతులపై స్థల పరిశీలన చేస్తున్నట్లు ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు స్థలాన్ని ఆయన స్థానిక పంచాయతీ కార్యదర్శి జిలుకర వెంకన్నతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరుప్పుల కూడలి ప్రాంతంలో వచ్చే ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని నిర్మించతలపెట్టిన సులభ్ కాంప్లెక్స్ కోసం సరైన స్థలం సేకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



చిల్పూరు: ఫత్తేపూర్ గ్రామానికి చెందిన భీమగోని కొమురయ్య గౌడ్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. కాగా, దహన సంస్కారాలకు పల్లగుట్ట గ్రామస్తులు రూ.20వేలు మృతుడి భార్య భాగ్యమ్మకు అందజేశారు.

బాధిత కుటుంబానికి చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాదె చిట్టిబాబు ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఇల్లందు రాజనారాయణ 50 కిలోల బియ్యాన్ని అందించారు. అదేవిధంగా మాజీ ఎంపీటీసీ గన్ను నర్సింహులు 50 కిలోలు, మాజీ వార్డు సభ్యుడు కొలిపాక వేణు తమవంతు చేయూత 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

తరిగొప్పుల/బచ్చన్నపేట/పాలకుర్తిటౌన్: గొల్లకురుమలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు మంగళవారం తరిగొప్పుల, బచ్చన్నపేట, పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నాయకులు నిరసన తెలిపి తహసీల్దార్లకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

జనగామ రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చెన్నకేశవులు తెలిపారు. మంగళవారం గుండ్లగడ్డలో పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 44 క్వింటాల రేషన్ రేషన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. బియ్యంతో పాటు టాటా ఇంట్రా వాహనం, టూ వీలర్, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.